క్లుప్తంగా

వెండి పిల్లనగ్రోవి సమర్పణ



అలయ నిర్వాహకులకు పిల్లనగ్రోవిని అందచేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణాలయం లోని శ్రీకృష్ణునికి సోమవారం కోటవీధికి చెందిన అలవకొండ ప్రసాద్‌రెడ్డి, కుమారి, కుమార్తె శ్రీలక్ష్మి వెండి పిల్లనగ్రోవిని సమర్పించారు. స్వామివారికి అలంకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్, కార్యదర్శి పాడావుల గండి ఆంజనేయులుకు పిల్లనగ్రోవిని అందచేశారు. వీరిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు

రాజుపాళెం : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్కటవేముల జెడ్పీ హైస్కూల్‌లో జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ పోటీలను ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు క్రికెట్ అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తారని, 29, 30న కబడ్డీ, జనవరి 2, 3 వాలీబాల్, 4న బ్యాడ్మింటన్, 5, 6 ఖోఖో నిర్వహిస్తామని వివరించారు. ఈ పోటీల్లో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గురుకుల పాఠశాల భవనాలు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనాలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లె దగ్గర నూతనంగా నిర్మించిన మహాగురుకుల పాఠశాల భవనాలను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించనున్నారు. జిల్లాలో మొదటగా మహాగురుకులం బ్రహ్మంగారిమఠం మండలలో ఏర్పాటు చేశారు. ఇక్కడ 5వతరగతి నుంచి 10వతరగతి వరకు ఇంగ్లీష్ మీడియం చదువుతో పాటు వసతి, ఆటలు, మంచి వాతావరణంలో పాఠశాలను నిర్మించారు. పాఠశాల భవనాల ప్రారంభానికి అధికారులు అన్ని సిద్ధం చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీల సమ్మెకు కత్తి నరసింహారెడ్డి మద్దతు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్టీయూ నాయకుడు రషీద్‌ఖాన్ సమ్మెకు మద్దతు తెలిపారు.

రేపు మడూరు సచివాలయ భవన సముదాయం ప్రారంభం

చాపాడు : మండల పరిధిలోని మడూరు గ్రామంలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయ భవనాలను బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించనున్నట్లు ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ భవనం రూ.43 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ రూ.23.80 లక్షలు, రైతు భరోసా కేంద్రం రూ.24.80 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



ప్రొద్దుటూరు : వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ పట్టణాధ్యక్షుడు వంకదార నరేంద్రరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. వాజ్‌పేయి జీవితాంతం దేశాభివృద్ధికి కృషి చేశారని బీజేపీ నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సీపీ జయలక్ష్మి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాస కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలోని ఉత్తరాదిమఠంలో మంగళవారం శ్రీ శ్రీనివాసుని కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉభయ దేవేరులతో స్వామిని ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చి భక్తులు ఊరేగింపుగా అహోబిళమఠం నుంచి తీసుకొచ్చారు. మహిళా భక్తులు చేసిన కోలాటాలు ఆకట్టుకున్నాయి.

క్రీస్తు మార్గం అనుసరణీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని మైదుకూరురోడ్డులోని ఎస్పీజీ-1, గోకుల్ నగర్‌లోని ఎస్పీజీ-2, దొరసానిపల్లెలోని ఎస్పీజీ-3, రామేశ్వరం సీఎస్ఐ, వైఎంఆర్ కాలనీలోని గోల్డెన్ జూబ్లీ తదితర అన్ని చర్చిల్లో అర్ధరాత్రి, ఉదయం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి దేవుని వాక్యాన్ని వినిపించారు.

■ స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ -1 చర్చిలో డీనరి చైర్మన్ అబ్రహం ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన సేవ, దయ, ప్రేమ మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలని తెలిపారు. యేసు క్రీస్తు జన్మవృత్తాంతాన్ని, ఆయన మానవాళికి చేసిన మేలును వివరించారు. క్రీస్తు రాక లోకానికి శుభసూచకమని, ఆయన మహిమలను తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేసి భక్తిగీతాలు ఆలపించారు.

■ గోకుల్‌నగర్‌లోని ఎస్పీజీ-2 చర్చిలో ఫాస్ట్రేట్ చైర్మన్ కె.రాజు క్రిస్మస్ పండుగ విశిష్టతను యేసు ప్రేమతత్వాన్ని తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని గోల్డెన్ జూబ్లీ చర్చి, రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొన్ని చర్చిల్లో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఈ ప్రార్థనలు జరిగాయి.

106 ఏళ్లుగా క్రిస్మస్ వేడుకలు

ప్రొద్దుటూరు : 106 ఏళ్లుగా రామాపురం గ్రామంలో క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. ఆనవాయితీగా క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని కొత్తపేటలోని మాజీ సర్పంచ్ గుద్దేటి వెంకటసుబ్బారెడ్డి ఇంటి నుంచి రామాపురం చర్చి వరకు క్రిస్మస్ ట్రీని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ మాజీ సర్పంచ్ కుటుంబం ఆధ్వర్యంలో ప్రతిఏటా క్రిస్మస్ ట్రీని తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. 106 ఏళ్లుగా ఈ ఉత్సవం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుద్దేటి వెంకటసుబ్బారెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ బండిఆత్మకూరు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ప్రాప్తం యాకోబ్, కొత్తపేట జయరామిరెడ్డి, ఆర్‌సీపీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక వైఎంఆర్ కాలనీలోని సీఎస్ఐ గోల్డెన్ జూబ్లీ చర్చిలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. అనంతరం సంఘ పెద్దలు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌సీపీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, నాయకుడు స్నూకర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : పాల్గొన్న క్రైస్తవులు



సీఎస్ఐ చర్చిలో దైవసందేశమిస్తున్న డీనరీ చైర్మన్ రెవ. ఆనందబాబు



మైదుకూరు: కృష్ణాపురం చర్చిలో దైవ సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ అర్నిష్ రాజ్

■ వరల్డ్ మిషన్ సొసైటీ చర్చి ఆఫ్ గాడ్ ఆధ్వర్యంలో జిన్నా రోడ్డులోని ఉర్దూ స్కూల్‌లో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్ మహ్మద్ గౌస్, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం : మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయా గ్రామాల్లోని చర్చీలను అందంగా ముస్తాబు చేశారు. రాజుపాళెం ఎస్సీ కాలనీలో తెల్లవారు జామున ఏసు శిలువను పురవీధులలో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం చర్చిలో పాస్టర్లు సీమారాణి, వెలవలి, తొండలదిన్నె, టంగుటూరు గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్ బాబు సందేశాన్ని అందజేశారు. ప్రార్థనల అనంతరం సాయంత్రం ఆయా గ్రామాల చర్చిల ఆవరణలో ఆటలపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారందరికి బహుమతులను పంపిణీ చేశారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరులో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శాంతినగర్ సెయింట్ థామస్ సీఎస్ఐ, ఆర్సీఎం, సీఎస్ఐ షాలోమ్ టౌన్ చర్చి, కృష్ణాపురం సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలిపుకొన్నారు. కృష్ణాపురం చర్చిలో పాస్టర్ అర్నిష్ రాజ్ బైబిల్‌లోని దేవుని వాఖ్యాలను, దైవ సందేశాన్ని చదివి వినిపించారు.

భక్తి శ్రద్ధలతో క్రిస్‌మస్ ప్రార్థనలు

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలోని క్రైస్తవ సోదరులు సోమవారం క్రిస్‌మస్ వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని చాపాడు, పల్లవోలు, బద్రిపల్లె, చియ్యపాడు, గుంతచీపాడు, అన్నవరం, మడూరు, మొర్రాయిపల్లె, చిన్నగురువళూరు, అల్లాడుపల్లె, కేతవరం, రాజుపాళెం, అనంతపురం, ఎన్. ఓబాయపల్లె తదితర గ్రామాలలోని క్రైస్తవ సోదరులు సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చాపాడులో క్రికెట్ మ్యాచ్

చాపాడు : క్రిస్‌మస్ పర్వదినం పురస్కరించుకుని మండల కేంద్రమైన చాపాడులో సోమవారం క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. చాపాడు సీఎస్ఐ చర్చి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన 12 ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌లో ప్రణయ్‌కుమార్ టీంపై సందీప్ కుమార్ టీం గెలిచింది. మొదట 12 ఓవర్లలో ప్రణయ్‌కుమార్ టీం ప్లేయర్లు 101 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన సందీప్ కుమార్ టీం ప్లేయర్లు 8 ఓవర్లలోనే 102 పరుగులు చేసి గెలిచారు. 48 పరుగులు చేసి ఒక వికెట్ తీసిన జాన్సన్‌కు ప్లేయర్ ఆఫ్ మ్యాచ్ లభించింది. ఈ సందర్భంగా గెలిచిన టీం సభ్యులకు గ్రామ పెద్దలు కప్ అందజేశారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : మాట్లాడుతున్న ఎస్పీజీ -1 చర్చిలో డీనరి చైర్మన్ జోసఫ్ బాబు

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : పట్టణంలోని క్రైస్తవ సోదరులు సోమవారం క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇళ్లపై క్రిస్మస్ స్టార్‌లను వేలాడదీశారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో డీనరీ చైర్మన్ రెవ. ఎం.ఎఫ్.ఎస్.ఆనందబాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఫాతిమా మాత చర్చిలో విచారణ గురువులు ఫాదర్ గౌడుగునూరు విజయరావు దివ్య బలిపూజ నిర్వహించారు. ఇక్కడ ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. అలాగే స్థానిక మైదుకూరురోడ్డులోని పునీత ఆంతోనివారి దేవాలయంలో నిర్వహించిన ప్రార్థనల్లో ఫాదర్ రెవ. ఫాదర్ గడికోట మనోహర్, రెవ. ఫాదర్ ఆరోగ్యరాజ్ దైవసందేశం ఇచ్చారు. స్థానిక సుందరయ్యకాలనీలోని బ్లెస్సింగ్‌చర్చిలో రెవ. ఫాదర్ వీరదాసరిభాస్కర్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. పట్టణంలోని బేతెస్థ, హోసన్నా, గాడ్‌మినిస్ట్రీస్, మార్తోమా చర్చిలతో పాటు కొత్తచెరువు, నందిపల్లె గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో అర్ధరాత్రి యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి ప్రార్థనలు చేశారు. అమగంపల్లె పురాతన చర్చిలో ఫాదర్ దేవరాజు క్రీస్తు జననం గురించి వివరించారు. మేరీమాత గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

గోపవరంలో..

గోపవరం : మండల వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని అన్ని చర్చిలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. తెల్లవారుజాము నుండే క్రైస్తవ సోదర, సోదరీమణులు ప్రార్థనల్లో పాల్గొని అనంతరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చర్చిల్లో ఫాదర్లు దైవసందేశం ఇచ్చారు.

కలసపాడులో..

కలసపాడు : కలసపాడులోని పరిపేతురు పరిపాలు దేవాలయంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువులు రెవ. సంజయ్‌మధు, రెవ. ఆశిస్‌గాబ్రియేల్ ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయుడు కె.జె.ప్రవీణ్‌కుమార్ (చిన్ను) 40 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని ఆశీర్వదిస్తున్న చర్చి పాస్టర్



ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్పీజీ-2 చర్చిలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం



రాజుపాళెం: ఏసు శిలువను పురవీధుల్లో తిప్పుతున్న పాస్టర్లు సీమారాణి



చాపాడు : గుంతచీపాడులో క్రిస్‌మస్ వేడుకలు



కలసపాడులో చర్చి చుట్టూ తిరుగుతున్న విశ్వాసులు



ప్రొద్దుటూరు : క్రిస్మస్ ట్రీని తీసుకెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు

రూ.20 లక్షలతో చర్చి నిర్మాణాన్ని పూర్తి చేయిస్తా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : చర్చి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రూ.20 లక్షలతో చెన్నమరాజుపల్లె గ్రామంలో ఎస్పీజీ-2 చర్చి నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో రూ.20 లక్షలతో చర్చి నిర్మాణానికి సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామస్తులు చర్చి లేని కారణంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తన దృష్టికి తెచ్చారన్నారు. వారి అభ్యర్థన మేరకు స్థలం కొనుగోలు చేయించానని, రూ.20లక్షలతో చర్చి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ భగవంతున్ని ఆరాధించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌సీపీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నశ్యం శ్రీనివాసులు, రవి, భాస్కర్, అజరయ్య, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, నాగాయపల్లె షరీఫ్, పాస్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారులను ఆదుకోండి



మాట్లాడుతున్న వస్త్రవ్యాపారులు శివశంకర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, రాఘవేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పట్టణంలోకి కార్పొరేట్ వ్యాపారులు ప్రవేశించడంతో స్థానిక వస్త్ర వ్యాపారులు రోడ్డున పడతారని వివేకానంద క్లాత్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండేల శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 600 వస్త్రదుకాణాలు ఉండగా 8వేల మందిపైగా ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రొద్దుటూరు వస్త్రాలతోపాటు బంగారు, నూనె, మండి వ్యాపారానికి ప్రసిద్ధి చెందిందన్నారు. తాము వస్త్రవ్యాపారం పైనే ఆధారపడి జీవిస్తున్నామని తమ సంపాదన ఇక్కడే ఖర్చుచేస్తామని, ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు వారికి వచ్చే ఆదాయం ఇక్కడ ఒక రూపాయి ఖర్చుపెట్టరన్నారు. ఈ మేరకు స్థానిక వ్యాపారులను ఆదుకోవాలని ఆదివారం ఇడుపులపాయలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించామన్నారు. సమావేశంలో వివేకానంద క్లాత్ మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ చీమల రాజశేఖరరెడ్డి, సెక్రటరి రామచంద్రయాదవ్, బాలాజిక్లాత్ మార్కెట్ కార్యదర్శి మచ్చా శంకరయ్య, పిట్టా వేణుగోపాల్, న్యూవస్త్ర భారతి క్లాత్‌మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చీమల రాఘవేంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు డి.నగేష్, కార్యదర్శి బాలాజి, కోశాధికారి హరిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మంగారిమఠంలో భూమి పూజ కార్యక్రమం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిలు మంగళవారం పలు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు చేయనున్నట్లు పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర ద్వారం దగ్గర వంక సుదరీకరణకు రూ.34.50 లక్షలు, గోకులం నిర్మాణంకు రూ.15.98 లక్షలు, కళ్యాణకట్ట నిర్మాణంకు రూ.20.55లక్షలు, భక్తుల డార్మిటరీ రూ.50.62 లక్షలు, హైమాస్క లైట్లు రూ.34లక్షలు, పోలేరమ్మ దగ్గర ప్రహరీ నిర్మాణంకు రూ.57.72 లక్షలు, పోలేరమ్మదగ్గర షాపింగ్ కాంప్లెక్స్ కు రూ.21.26 లక్షలు, ముఖద్వారం నిర్మాణంకు రూ.7.21లక్షలు, వంటశాలకు రూ.15.69 లక్షలు పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. అలాగే బి.మఠం దేవస్థానంలో ప్రాకారం నిర్మాణానికి రూ.1.25 కోట్లు, గాల్వ నైజింగ్ షెడ్ నిర్మాణంకు రూ 98లక్షలు, ఫ్లోరింగ్ నిర్మాణంకు రూ.47లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.42.50 లక్షల నిధులతో పనులు చేయనున్నట్లు తెలిపారు.

నేడు కాశినాయన ఆరాధన మహోత్సవాలు

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని ఎన్.పాలగిరి క్రాస్‌లోని మొగమూరు వాగు సమీపంలో వెలసిన అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో మంగళవారం 28వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పూజా కార్యక్రమాలు, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు భజన కార్యకమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు వేంపల్లె అంజని ఈవెంట్స్ వారిచే పాటలు, జబర్దస్త్ టీమ్ వారిచే కామెడి, మిమిక్రీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి న్యూ కేటగిరి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

వైభవంగా అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర



శ్రీరాముని అక్షింతల శోభాయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు



శ్రీరాముని అక్షింతల శోభాయాత్రకు వేలాదిగా హాజరైన భక్తులు



ఊరేగింపుగా అక్షింతలను తీసుకువస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో శ్రీరాముడిని పూజించిన అక్షింతలు సోమవారం బద్వేలుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షింతల శోభాయాత్ర వేలాది భక్తుల నడుమ వైభవంగా జరిగింది. స్థానిక పోరుమామిళ్ళ రోడ్డులోని మారుతిభజన మండలి ఆంజనేయస్వామి గుడి వద్ద నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా మైదుకూరు రోడ్డు, సిద్దవటం రోడ్డు, నెల్లూరు రోడ్డులోని గోవిందమఠం ఆవరణలో గల శ్రీదేవి, భూదేవి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. ఈ శోభాయాత్రలో పట్టణానికి చెందిన ఆయా పార్టీల రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య, బలిజ, రెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులతో పాటు పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్రలో ఏర్పాటు చేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ కన్వీనర్ రామకోటిరాజు, అధ్యక్షులు కొండపల్లి వెంకటసుభాష్‌లు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట జరిగేనాటికి భక్తులందరికి ఈ అక్షింతలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కొంకులరాంబాబు, బలిజ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దద్దంవెంకటేశ్వర్లు, కొర్రపాటిసురేంద్ర, పెరుగువెంకటయ్య, కార్యక్రమ నిర్వాహకులు ఈశ్వరయ్య, యర్రంరెడ్డి, సంజీవరెడ్డి, వి.వి.రమణ, శ్రీనివాసులు, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, రెడ్డిసేవా సంఘం అధ్యక్షుడు గంగసానిసాంబశివారెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనంవారిపల్లెకు చేరిన అయోధ్య అక్షింతలు

కాశినాయన : అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తి కాబడి 2024 జనవరి 22వ తేదీన రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్, జనహిత సంఘాల ఐక్యతతో అయోధ్య నుండి అక్షింతలు రాష్ట్రాలకు, జిల్లా కేంద్రాలకు, మండల కేంద్రాలకు రావడం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం మండలంలోని ఆనంవారిపల్లె గ్రామానికి డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో ఊరేగింపుగా అక్షింతలు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగికి స్ఫూర్తి పురస్కారం

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి శిరిగిరిశివ సోమవారం ఓబుళాపురం వద్ద ఉన్న వివేకానంద సేవాశ్రమంలో స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. ఆర్మీ ఉద్యోగి వివేకానంద ఫౌండేషన్ సంస్థలో కీలక సేవలు అందిస్తుండటంతో వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి స్ఫూర్తి పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన మండలంలోని పి.పి.కుంటలో వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సుధ చేతులమీదుగా ప్రాంభించారు. ఈ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. సిద్దవటంకు చెందిన టీం విన్నర్‌గా నిలువగా రన్నర్‌గా పి.పి.కుంట టీం ఎంపికైంది. ఎంపికైన విన్నర్, రన్నర్ టీంలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, వెంకటేష్ చేతుల మీదుగా మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలును వారికి అందజేశారు. బేతాయపల్లె సచివాలయ కన్వీనర్ మునగల సునీల్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు.

పేదలకు అన్నదానం



వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న విజయమ్మ, రితేష్‌రెడ్డి, తదితరులు

బద్వేలు అర్బన్ : దివంగత బిజివేముల వీరారెడ్డి ఆశయసాధనకు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ యువనేత, ఎస్‌బీవీఆర్ విద్యాసంస్థల సెక్రటరీ కె.రితేష్‌రెడ్డిలు అన్నారు. బిజివేముల వీరారెడ్డి 23వ వర్ధంతి సందర్భంగా సోమవారం మైదుకూరురోడ్డులోని వీరారెడ్డి ఘాట్‌లో, నాలుగు రోడ్ల కూడలిలోని వీరారెడ్డి కాంస్య విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అలాగే పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విజయమ్మ కోడలు లీలాకైవల్యారెడ్డి, టీడీపీ కడప పార్లమెంటు అధ్యక్షులడు లింగారెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంరామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

రాజంపేట టౌన్ : పట్టణంలోని రీజెన్సీ నలంద స్కూల్‌లో సోమవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు.

అనంతరం ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి, టీటీడీకి చెందిన వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో కల్యాణ క్రతువును నిర్వహించారు. శ్రీవారి భక్తసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. కల్యాణం అనంతరం నిర్వాహకులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి